స్కెచ్

# క్రొత్తరోజులు

వడ్లపట్ల దయానందం

ప్రోగ్లుగుండాన పడుతున్న రోజుల్లో ఉన్నాం. దాదాపు ఆ వ్యవహారమూ పూర్తి కావస్తున్నది. మనకోసం పుట్టి, మన సేవనే పరమావధిగా నెంచి వద్దన్నా మనచుట్టూ పలుమార్లు తిరిగిన అభ్యర్థప్రబుద్ధుల ముఖాల్నిప్పుడు చూడాలనుకున్నా కన్పించని క్రొత్తరోజుల్లోకి తిరిగీ ప్రవేసించబోతున్నాం. పోటీచేస్తున్న అభ్యర్థులు భారీయెత్తున వేలు తగలబెట్టడం కూడా దాదాపూ పూర్తి కావచ్చినట్లే.

పాడుపడిపోయిన రాములవారిగుడిని బాగుచేయించాల్సిన బాధ్యతగాని ... అమోనియా సారా తాలూకు అనఫీషియల్ దుకాణాలకి రక్షణ కల్పించాల్సిన పవిత్ర బాధ్యతగానీ....కాటన్ మార్కెట్ కంపెనీ ప్రొప్రయిటర్‌కి ప్రభుత్వోద్యోగికి మధ్య సంప్రదింపుల తాలూకు ఉన్నత కార్యక్రమ నిర్వాహణా బాధ్యతగాని....నన్నికారు ప్రముఖులకి చేయాల్సిన చిన్న చిన్న సహాయాల వ్యవహారంకాని ఇక అభ్యర్థులకి తప్పిపోయినటే.

ఓడిపోయిన అభ్యర్థిని ఎవరు కలుసుకున్నా ''మోసగించింది నువ్వే పొమ్మం''టాడు. గెలిచిన అభర్థిని కలుసుకోడానికి ఆయన నిద్ర లేవడు. ఒకవేళ లేచినా, లేచిందే తడవుగా ఇటు హైదరాబాదులోనో అటు ఢిల్లీలోనో ఉండిపోతాడు. మనఅభ్యర్థి సిసింద్రీలా గొడవ చేశాడన్న సమాచారాన్ని సేకరించుకు సంతోషించాల్సిందే....ఏది ఎలాఉన్నా నెల 1కి అక్షరాలా ఇటు నూటయాభై, అటు ఐదువందలు రూ॥లు గౌర వేతనం పుచ్చుకుంటూ పరుపుల పెట్టెల్లో, చిన్నకార్లల్లో....ప్రజలపేరు చెప్పకుని ప్రజలకోసం తిరిగేస్తారన్నదిమాత్రం యదార్థం.

ప్రజాస్వామిక వ్యవస్థని మనసార సమర్థిస్తున్నాం కనుక మనకోసం మనం మనప్రతినిధుల్ని ఎన్నుకోవలసిన తతంగం తాలూకు వ్యవహారం అదీ. అదే దాదాపూ పూర్తికావచ్చింది. ఎవరినెన్నుకోవాలీ అన్నవిషయం మీద దమ్మిడీకి మూడుచొప్పన అగ్రనాయకుల ఉపన్యాసాల్ని విన్నాం మొదటి పేజీలోని మొదటికాలం మొదలుకుని ఆఖరు పేజీలోని ఆఖరుకాలం వరకు, రాష్ట్రీయ నాయకులు మొదలుకుని దేశీయనాయకుల ఉద్ఘాటనలు వెయ్యిన్నూటపదహారుసార్లు వార్తాపత్రికల్లో చదివిందే చదివాం. ఎటొచ్చీ ఇప్పుడు మన ఆత్మతల్లా ఫలితాలెలా ఉంటాయా అన్నదే—

గెలుపొందే అభ్యర్థులు నిజంగా ప్రజలకి ప్రాతినిధ్యం వహించగలరా? ప్రజానీకంలోని నిరక్షరాస్యతను ...విషయపరిశీలనాశక్తి శూన్యతను... ఆధారంగా చేసుకుని....ప్రజాస్వామిక సూత్రాలకి .... స్వచ్ఛమైన రాజకీయాలకీ.... వక్రభాష్యాలు చెబుతూ ప్రజానీకం స్థాయిని మరింతగా ఎల్లా కుదించివేస్తున్నాయ్?

అభ్యర్థుల నియామకంలోని 'నేపథ్య' తతంగం దీనికి స్పష్టంగా సమాధానం ఇస్తుందనుకోవడంలో తప్పేమీ లేదు. నేడు పోటీలో పాల్గొన్న పక్షాలన్నింటిని "అధికారపక్షం'' — ''ప్రతిపక్షాలు''—అన్న రెండుగా విభజించుకుంటే వాటి తరఫున అభ్యర్థులు ఈ ప్రాతిపదికమీద నిలపబడ్డారనుకోవచ్చును—

''కులతత్వం .... మురాతత్వం ... ఆర్థిక, అంగబల సంపన్నత ..'' ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పై ప్రాతిపదికలమీద అభ్యర్థులని నిలపడానికి మాతృసంస్థయైన కాంగ్రెసే మిగిలిన పార్టీలకి మార్గదర్శి అయిందని అంటున్నారు అట్టిప్రాతిపదికలమీద నిలపబడ్డకాంగ్రెస్ అభ్యర్థులతో పోటీపడటానికి ప్రతిపక్ష పార్టీలలో ప్రధానమైనవి సైతం అవే ప్రాతిపదికల మీద అభ్యర్థులను నిలిపాయ్ అనేదికూడా సత్యదూరంకాదు.